# లోకంలో.............!

రచన: 'జ్ఞానశ్రీ'

●

"నేను రాను...అసలు రావటానికి నామనస్సు ఏ పిసరంతైనా అంగీకరించకుండావుంది..."

అంటూ ఆఅమ్మాయి భీష్మించుకు కూర్చుంది... ప్రక్కను నిలబడివున్న ఆమె తల్లి యిలా ప్రారంభించింది...

"ఏనాడో ఐదుఏళ్ళక్రితం విడిచిపెట్టిన ఆ దద్దమ్మ నామొగుడంటూ ఏముఖంపెట్టుకు బయలు దేరుతున్నావు...కోమటి గుమ్మంఅంటే యెరుగని నువ్వు....పురుషుడంటే ప్రక్కకు తప్పుకుతిరిగే నువ్వు...యీ గేటుదాకా యేలావచ్చావో నాకు అర్ధంకాకుండావుంది...రా...యింటికివచ్చి హాయిగా తిని పనిపాటులుచేసుకో..."

అంటూ లాలించటం ప్రారంభించింది...

నేనూ పంతులూ రోడ్డుమీదకూర్చుని యీ తమాషాఅంతా చూస్తూ చెవులతో వింటున్నాం...

నాకు బలేఆశ్చర్యం వేసింది...మూడుముళ్ళూ వేసి పుస్తెకట్టిన భర్తదగ్గరకు పోతానంటే ఆతల్లి కూతుర్ని పంపటానికి అనుమానిస్తున్నది....ఎందుకు అనుమానిస్తున్నదో వినాలన్న కుతూహలం పెచ్చురేగటం ప్రారంభించింది...ఓరకంటితో అటు వేపే చూస్తున్నా...

పంతులు మాత్రం నావేపు ఓరగాచూసి చిన్న చిరునవ్వు విసిరేడు...ఆచిరునవ్వులోని భావాన్ని అర్ధంచేసుకున్న నామనస్సు ఉషారుగా భావతంత్రులనుమీటి రాగాలాపన మొదలుపెట్టింది...

ఒక్కక్షణం నిశ్శబ్దం...

మళ్ళీ ఆతల్లి ప్రారంభించింది...

"నువ్వు ఆ తెల్లకోక యెక్కడపెట్టేవు...లేకపోతే యేడొంకలమీద పారేసేవు...అసలు నువ్వు యింతదూరం యేలావచ్చేవు.... చెప్పు.... చెప్పకపోయేవా జుత్తుపట్టుకుయీడ్చి తంతాను తెలుసా..."

అంటూ మహాకాళిలా విజృంభించింది...

"ఎలావస్తేనేం...యీ రోడ్డుదగ్గరకు రావటం జరిగింది...నన్నొకరు తీసుకువచ్చేదేమిటి నేనే వచ్చేను...అదీగాక నాభర్తదగ్గరకు పోటానికి నేను బయలుదేరేను" అంటూ ఆపిల్ల మారాయించుకు కూర్చుంది...

"ఇన్నాళ్ళూ లేనిమొగుడు యిప్పుడెక్కడ నుండి ఊడిపడ్డాడు ... తిన్నతిండి ఒంటికియెక్కి కొవ్వు బలియబట్టే యిలా వాగుతున్నావు ... నీకు మొగుడే కావలసినట్లయితే పిలవని పేరంటంలా నువ్వు బయలుదేరటం ఏమంత బాగులేదు...

అంటూ తలప్రక్కకుత్రిప్పి నలుగురివేపూ చూసింది ... ధర్మాన్ని త్యజించి అల్లుని బానిసగా మార్చుకుందామనే యుద్దేశం వ్యంగ్యంగా కనపరుస్తున్న ఆమె మాటలు లోకంలోని నాగరికతకే ఒక విధంగా భంగకారిగా వుంది...

పంతులు నావేపుచూసేడు...ఆతడికళ్ళు నన్నుయేదో ప్రశ్నిస్తున్నాయి — కాని నాకు వీటి వేటి మీద ధ్యాసలేదు...

ఆలోచిస్తున్నా...

నాగరికతకూ...పతిభక్తికి...స్త్రీ మార్దవమునకు...త్యాగత్వమునకు...శౌర్యస్ఫూర్తికి పేరెన్నికగన్న...భారతభూమిలో జన్మించిన ఒక ఆడది... తనకూతుర్ని భర్తయింటికి పంపటానికి నిరాకరిస్తున్నాది...

ఇదే నిజమై ... ప్రపంచంలోని తల్లులంతా తమ కూతుళ్ళను అత్తింటికి పంపకపోతే సాంఘిక సాంప్రదాయమునకే గొడ్డలిపెట్టుగా ప్రాప్తించి, నశించిపోటానికి అభ్యంతరము వుండదు —

మళ్ళీ ఆ అమ్మాయి ప్రారంభించింది...

"నువ్వు యెన్నిచెప్పు... నేను తిరిగి ఇంటికి మాత్రం రాను... నా మొగిడిదగ్గరకే పోతాను... అనవసరంగా శ్రమపడి గాత్రానికి బాధ కలిగించుకోకు..."

అంటూ సర్దుకు కూర్చుంది...

స్త్రీమాంగళ్యము కాపాడే భర్త తన మనోనేత్రంలో ప్రస్ఫుటింపబడుతూ వున్నంతసేపూ యే స్త్రీకూడా ఆర్యధర్మసూత్రాలను ఖండించి చరించలేదు... ఈ సూత్రాన్నే విజ్ఞానంలేని ఆపిల్లప్రేమకు ప్రాధాన్యమిస్తూ కాపాడింది...

ఆలోచించిచూస్తే B. A.లుM. A.లు పాసై విజ్ఞానులమని డాబులుకొట్టుకు తిరిగే పడుచుకన్నెలకన్న వ్యవసాయపనులలో పెద్దలకు తోడ్పడుతూ కలో, గంజో త్రాగి పూరిగుడిశలో హాయిగా మెసలే పల్లెపడుచే విజ్ఞానవతి ననిపించుకుంది...

ఈతల్లీ కూతుళ్ళ సంభాషణ వింటున్న చుట్టుప్రక్కల కానాలమీది ప్రజలంతా గుమిగూడేరు... వీరిరాక గమనించిన ఆతల్లి సప్తమస్వరంలో మళ్ళీ మొదలుపెట్టింది—

"అప్పులు తీర్చుకుంటానంటే అరవై రూపాయలు యిచ్చేను—ఆ అప్పులు తీర్చుకుని భోగాపురంలోనూ, డెంకాడలోనూ...(ఆగి) అంతేకాదు ఈపంచంటా, ఆపంచంటా తిరుగుతూ ఇల్లు వాకిలీ లేక అఘోరిస్తున్నాడు... అటువంటివాడి దగ్గరకు నా కూతుర్ని ఏలా పంపేది..."

అంటూ వాళ్ళను ప్రశ్నించింది ... అందరూ తలోమాట అన్నారు... పంతులుకూడా చిన్న నవ్వు పారేసి....

"పుస్తెకట్టిన మొగుడిదగ్గరకు పంపకుంటే యేడుస్తున్న యీమనిషి యెంతో కష్టపడుతున్నాది.."

అంటూ తన అభిప్రాయాన్ని వెలిబుచ్చేరు...

అక్కడ చేరినవాళ్ళంతా మెట్టినింటికన్న కన్నయింటికి పొమ్మనే ఆ అమ్మాయికి సలహా యిచ్చేరు...

నాకుమాత్రం ఆ సలహా యేమాత్రం నచ్చలేదు...

స్త్రీమనస్సు లతవంటి సున్నితసదృశం ... యెదురుతిరిగితేమాత్రం కాలపాశం అవుతుంది ... అసలు స్త్రీహృదయాన్ని అర్థంచేసుకోటం యెంత కష్టమో దాన్ని చేపట్టటం అంత సులభం ... ఎన్ని గ్రహించలేని అక్కడి వాతావరణం ఆపిల్లపట్టును మరీ దృఢపరచింది...

అమాయకాన్ని మరోదృక్పథంలోంచిచూస్తే మూర్ఖత్వం అవుతుంది... ఈ ధర్మమునే అక్కడి ప్రజలలో చూడగలిగేను...

లోకం అన్న లోకంలోని ప్రజలన్నాయెంతో ఆరాటంతో తిలకిస్తూ చిత్రిస్తున్న నా కలానికి లోకంలో ఒక చిత్రం కనుపించింది...

చిత్రించుకున్నా ... ఇంకా చిత్రించుకుంటున్నా... ఇంతలో శ్రీకాకుళం పెట్టెబండి ధుమారం లేపుకుంటూ యేరుదాటివచ్చింది...

పంతులూ నేనూ బస్సుయెక్కేం... కాని ఆ స్త్రీమూర్తి... ఇంటికే పోయిందో ... భర్తదగ్గరకే పోయిందో... లేక లోకంలోకే పోయిందో... తెలుసుకోలేకపోయేం...

అంతతో కథ ఆగిపోయింది...

— —

## దక్షిణఇండియా సినిటెక్నిషియన్స్ అసోసియేషను వారి అయిదవ వార్షిక నివేదిక.

సినీటెక్నిషియన్స్ అసోషియేషన్ వారు చలనచిత్రరంగంలో సాగిస్తున్న కార్యక్రమ, ఆదాయ వ్యయమిట్టడ, మొదలైన వివరాలన్నీ దానిలో విపులంగా నిర్మించబడినవి. వలయువారు అసోషియేషన్ కార్యాలయం, సాగర్ బిల్డింగ్స్ వు, డ్స్ రోడ్, మౌంట్ రోడ్ పోస్ట్ మదరాస్ అని వ్రాయవచ్చు.